నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం | డిసెంబర్ 14, 2023 | www.navatelangana.com

ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావు కు సన్మానం

నవతెలంగాణ-బిచ్కుంద



సన్మానిస్తున్న మఠాధిపతి

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జుక్కల్ నియోజకవర్గం నుండి గెలుపొందిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును మండల కేంద్రంలోని బండయప్ప మఠాధిపతి సోమయప్పాస్వామి, కాంగ్రెస్ నాయకులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు సురేష్ షెట్కార్, సీనియర్ నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, పుల్కల్ మాజీ సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మున్నూరు నాగనాథ్, మండల పార్టీ అధ్యక్షులు ధర్పల్ గంగాధర్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి విజయ్ భాస్కర్ రెడ్డి ఉన్నారు.

దండిగుట్ట గ్రామపంచాయతీ తనిఖీ

నవతెలంగాణ-రెంజల్



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో

మండలంలోని దండిగుట్ట గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను డీఎల్పిఓ గౌస్ బుధవారం తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన ఇంటి పన్నులకు సంబంధించిన రికార్డులను ఆయన తనిఖీ చేశారు. పంచాయతీకి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని ఇన్చార్జి కార్యదర్శి చారి కి తెలిపారు. పంచాయతీ పరిసరాల పరిశుభ్రతతో పాటు, కుళాయి, ఇంటి పన్నులను వసూలు చేసుకోవాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ భర్త ముళ్ళపూడి కృష్ణారావు తదితరులు ఉన్నారు.

సుదర్శన్‌రెడ్డికి హోం శాఖ?

- సీఎం రేవంత్‌రెడ్డితో సాన్నిహిత్యమే కారణం

నవతెలంగాణ-నవీపేట్



సుదర్శన్‌రెడ్డి

మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి కీలక మంత్రి పదవి హోంశాఖ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత చూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిజామాబాద్ జిల్లాకు కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా వ్యవహరించే మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి సౌమ్యుడిగా వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తి కావడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బంధువు, సన్నిహితుడు కావడంతో కీలక హోమ్ శాఖ సుదర్శన్ రెడ్డికి ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలకు చోటు లేకపోవడంతో కీలక పదవి హోంశాఖ అప్పగించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి సైతం ఈ ప్రాంతంలో భవిష్యత్తులో మంచి పట్టు సాధించే వ్యూహం సీఎం రేవంత్ రెడ్డికి ఉన్నట్లు తెలుస్తోంది. కాగా సుదర్శన్ రెడ్డికి మాత్రం మరొక శాఖపై ఆసక్తి చూపడంతో కొంత ఆలస్యం అవుతున్నట్లు సన్నిహితులు భావిస్తున్నారు. కానీ హోం శాఖ లాంటి కీలక బాధ్యతలు తీసుకోవడంతో బోధన్ నియోజకవర్గానికి రాష్ట్రంలో ప్రాధాన్యత లభిస్తుందని స్థానిక నాయకులు భావిస్తున్నారు. వయసు రిత్యా మరో మారు పోటీ చేసే అవకాశం లేదని పలుమార్లు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేయడంతో రాజకీయంలో చివరిసారి హోంశాఖ బాధ్యతలు చేపడితే ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోవచ్చని నిజామాబాద్ జిల్లా ప్రముఖులతో పాటు రాజకీయ విశ్లేషకులు ఆయన సన్నిహితులు భావిస్తున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరమే నిజామాబాద్ జిల్లాకు, సొంత నియోజకవర్గం బోధన్‌కు వస్తారని ప్రచారంలో ఉండడంతో త్వరగా మంత్రిగా రావాలని కాంగ్రెస్ పార్టీ అభిమానులు, సన్నిహితులు కోరుకుంటున్నారు.

11 దాటిన తర్వాతే కలెక్టరేట్‌లోకి

- సమయపాలన పాటించని పలువురు ఉద్యోగులు
- పర్యవేక్షణ కరువైనట్టు విమర్శలు

నవతెలంగాణ-కామారెడ్డి



ఉదయం 11 గంటల తర్వాత వెళ్తున్న ఉద్యోగులు

కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వివిధ శాఖల ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. కొంతమంది ఉద్యోగులు ఉదయం 11 దాటితే కానీ కార్యాలయానికి రావడం లేదు. ప్రజలు తమ పనుల కోసం జిల్లా కార్యాలయానికి వస్తే ఉద్యోగులు వచ్చేవరకు వేచి చూడాల్సిందే. పలువురు ఉద్యోగులు కార్యాలయానికి ఆలస్యంగా వచ్చి సీట్లో ఆసీనులై ఫైల్ తిరిగేసే సరికి 12 గంటలు దాటుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తర్వాత గంటకు భోజన విరామం ఉంటుంది. దీంతో ఏదైనా సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వస్తే సాయంత్రం వరకు అక్కడే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం జిల్లాకు చెందిన వివిధ శాఖల జిల్లా కార్యాలయాలు ఒకే చోట ఉండాలనే ఉద్దేశంతో సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నిర్మించింది. అందులో జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, దివ్యాంగుల సంక్షేమ శాఖ, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, సమాచార శాఖ, మత్స్యశాఖ, ఆరోగ్య శాఖ తదితర శాఖలన్నీ ఒకే చోట ఏర్పాటు చేశారు. దీని ముఖ్య ఉద్దేశం ప్రజలు కార్యాలయం పేరు తెలవకుండా వస్తే ఈ కార్యాలయంలో పని కాదు ఆ కార్యాలయం చెప్తే దూరం వెళ్లవలసిన అవసరం లేకుండా దగ్గరలోనే ఉంటాయని ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉద్దేశాన్ని మాత్రం ఆయా శాఖలో పని చేసే పలువురు ఉద్యోగులు అమలు చేయడం లేదు. దీంతో జిల్లా కార్యాలయాలకు వచ్చిన జిల్లా ప్రజలు ఉద్యోగుల కోసం వేచి చూడవలసిన పరిస్థితి నెలకొంది. కొన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులే స్వయంగా ఆలస్యంగా రావడంతో సిబ్బంది మరింత ఆలస్యంగా వస్తున్నారు. కొన్ని శాఖల అధికారులకు ఆలస్యంగా వస్తున్నారని అడిగితే ఫీల్డ్ పై వెళ్లినట్టు చెప్పడం రివాజుగా మారింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఆయా శాఖలపై దృష్టి సారించి ఉద్యోగుల సమయపాలన పాటించే విధంగా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలి

- వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో కలెక్టర్ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో ఎరువుల సమీకరణ, వాటి పంపిణీ తీరుతెన్నులపై సమీక్ష జరిపారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత నెలకొనకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు వారు సాగు చేస్తున్న పంట విస్తీర్ణాన్ని అనుసరిస్తూ సరిపడా మోతాదులో ఎరువులు అందించాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎరువుల క్రయవిక్రయాల వివరాలను ఈ-పాస్ మెషిన్ ద్వారా వెంటదివెంట నమోదు చేసేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తేవాలన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువుల వల్ల రైతులు మోసపోకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, జిల్లా సహకార శాఖ అధికారి సింహాచలం, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ రంజిత్ రెడ్డి, ఆయా మండలాల ఏ.ఓలు పాల్గొన్నారు.

దివ్యాంగులు.. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



జెండా ఊపి క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

దివ్యాంగులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరా గాంధీ స్టేడియం బుధవారం అంతర్జాతీయ దివ్యంగుల దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దివ్యాంగులు గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించాలని సూచించారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు దోహదపడుతుందన్నారు. క్రీడా పోటీలకు జిల్లా నుంచి దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరు కావడం అభినందనీయ మన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా దివ్యాంగులు నిలవాలని ఆకాంక్షించారు. పట్టుదల ఉంటే తమలక్ష్యాలను నెరవేర్చుకోవచ్చునని తెలిపారు. వీల్ చైర్, త్రీ వీలర్ వెహికల్ పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ అధికారి బావయ్య, ఐకెపి డిపిఎం రమేష్ బాబు, ఐ సి డి ఎస్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మున్సిపల్ జీవో ప్రకారం
కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఎల్లారెడ్డి మున్సిపల్‌లో జీవో నాలుగు ప్రకారం అన్ని కేటగిరి వారికి పెరిగిన జీతాలు 16,600 రూపాయలు ఇవ్వాలని మున్సిపల్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిఐటియూ రాజనర్సు మాట్లాడుతూ ఎల్లారెడ్డి మున్సిపల్‌లో జీవో నాలుగు ప్రకారం 16 వేల 600 రూపాయలు, మేడే కానుక గత సీఎం ప్రకటించిన వెయ్యి రూపాయలు కార్మికులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేడే నుండి ఇప్పటి వరకు ఏరియర్స్ రూపంలో కట్టి ఇవ్వాలని, అందరికీ సమాన వేతనం ఇవ్వాలి డిమాండ్ చేశారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, ప్రతినెల 5వ తేదీ వరకు జీతాలు ఇవ్వాలని కోరారు. బెస్త పోచయ్య చనిపోయినప్పుడు చైర్మన్ ఇచ్చిన మాట ప్రకారం వారి కుటుంబానికి 50వేల ఇస్తానన్న రూపాయలు ఇచ్చి మాట నిలబెట్టుకోవాలి మున్సిపల్ కార్మికుల పైన వేధింపులు మానుకోవాలి మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కాకపోతే దీనికి బాధ్యత కమిషనర్ వహించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఇప్పటికైనా వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, నాయకులు వెంకట్‌గౌడ్, సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లారెడ్డి మున్సిపల్ కార్మికులు నాయకులు చంద్రయ్య, మల్లేష్, వెంకన్న, వేణు గౌడ్, మిజేందర్, లక్ష్మణ్, సాయవ్వ, లచ్చవ్వ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

రైతులను మోసగించొద్దు

- అధికారులు, వ్యాపారులు సహకరించాలి
- పత్తికొనుగోలు బీట్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మికాంతరావు
- మద్దతు ధర కంటే వంద అదనంగా పలికిన రేటు

నవతెలంగాణ-మద్నూర్



పత్తిబీట్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మికాంతరావు

రైతులకు పత్తి అమ్మకాల్లో ఎలాంటి మోసాలు జరగకూడదని పత్తి కొనుగోలు సాఫీగా జరిగేలా వ్యాపారులు, అధికారులు రైతులకు సహకరించాలని సక్రమంగా కొనుగోలు చేసేలా అధికార యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు సూచించారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక మూడు రాష్ట్రాలకు సరిహద్దులోగల మద్నూర్ మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో పత్తి కొనుగోలు బీట్‌లను బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు ప్రారంభించారు. కొనుగోళ్ల బీట్లు ప్రారంభంతో పత్తికి మద్దతు ధర కంటే 100 రూపాయలు అధికంగా పలికింది. మద్దతు ధర పత్తి క్వింటాలుకు 7020 రూపాయలు ఉండగా పత్తి కొనుగోళ్లలో పత్తి ధర క్వింటాలుకు 7120 రూపాయలు పలికింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పత్తి విక్రయాల కోసం వచ్చే వారికి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, పాలకవర్గం సభ్యులు మార్కెట్ కమిటీ సెక్రటరీ విట్టల్ మార్కెట్ కమిటీ సూపర్వైజర్ సత్యం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మద్దతు ధర కొనుగోలు అధికారి రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు జి సాహెబ్ రావు, జుక్కల్ జెడ్పిటిసి కుటుంబ సభ్యులు దాదారావు పటేల్, షక్కర్గ రామ్ పటేల్, హనుమాన్ స్వామి, పప్పు సెట్, తమ్మేవార్ భగవాన్, మేనూర్ గ్రామ సర్పంచ్ విట్టల్ గురుజీ, గ్రామ సర్పంచ్ సంతోష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో పత్తి కొనుగోళ్ల బిట్ల ప్రారంభోత్సవానికి వచ్చిన నూతన ఎమ్మెల్యే లక్ష్మికాంతరావును మార్కెట్ కమిటీ తరఫున మార్కెట్ కమిటీ కార్యదర్శి విటల్ శాలువతో ఘనంగా సత్కరించి బొక్కేను అందజేశారు. ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారిగా మద్నూర్ మండల కేంద్రానికి విచ్చేయడంతో మండల అంగన్వాడి టీచర్లు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ల యూనియన్ నాయకులు చెంపబాయి, కళావతి తదితరులు పాల్గొన్నారు

పాడి పోషణతో అధిక లాభాలు

- రైతులు ప్రత్యేకంగా దృష్టిసారించాలి : పశుసంవర్ధక శాఖ



పశువులకు వైద్య చికిత్సలు నిర్వహిస్తున్న పశువైద్యాధికారులు

నవతెలంగాణ-తాడ్వాయి

రైతులు పాడి పోషణ పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డివి ఏ హెచ్ ఓ నరసింహారావు తెలిపారు. తాడ్వాయి మండలం కన్కల్‌లో బుధవారం స్థానిక పాల కేంద్రం, ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ప్రత్యేక పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి డివిఏహెచ్ఓ నరసింహ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి పశు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫౌండేషన్ ప్రతినిధులు ఈ శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి రైతు వ్యవసాయంతో పాటు పాడి పశువులను పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. పాల ఉత్పత్తి అధికం కావడం కోసం ప్రత్యేకంగా ఆడదూడలు జన్మించదానికి కృత్రిమ గర్భధారణ చికిత్సలు నిర్వహించారు. ఈ చికిత్సలో మేలు జాతి పశువులను ఎంపిక చేసుకుని వాటికి కృత్రిమ చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ పులగం రాజు, సదాశివ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పులగం సాయిరెడ్డి, కన్కల్ పాలకేంద్రం అధ్యక్షులు గడ్డం కృష్ణారెడ్డి, తాడ్వాయి మండల పశువైద్యాధికారి రామ్ చందర్, మౌనిక ,సర్పంచ్ రాధా, ఉప సర్పంచ్ సాయిరెడ్డి, జూనియర్ వెటర్నరీ అధికారులు కొండల్ రెడ్డి, ప్రేమ్ సింగ్, గంగారం, గోపాలమిత్రులు మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో ఉద్రిక్తత.. 144 సెక్షన్



నిరసన వ్యక్తం చేసుత్ను వారిని శాంతింపజేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-వేల్పూర్(కమ్మర్‌పల్లి)

ప్రహరి విషయంలో వీడీసికి మరో గ్రూప్ వారికి మధ్య నెలకొన్ని వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రహరీని కూల్చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు బుధవారం రాస్తారోకో చేపట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీటీ రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల దూరంలో ప్రహరీ నిర్మించుకోవాల్సి ఉన్నా. దాన్ని ధిక్కరించి జీపీ అనుమతి లేకుండా ఓ గ్రూపు వారు ప్రహరీ నిర్మించారని, ఆ గోడను తొలగించాలని డిమాండ్ చేశారు.

వివరాలు మెయిన్‌లో..

డిగ్రీ కాలేజీ ఆస్తుల పరిరక్షణకు ఉద్యమిద్దాం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల పిలుపు



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తుల పరిరక్షణకై ఉద్యమించాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములు కబ్జా చేయడానికి ప్రైవేట్ వ్యక్తులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారని, శిశు మందిర్ పాఠశాల యాజమాన్యం తప్పుడు లీజు రిజిస్ట్రేషన్ చేయించుకుని అక్రమ నిర్మాణాలకు పాల్పడుతుందన్నారు. పాఠశాల చేపడుతున్న నిర్మాణాలు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాల ఆట స్థలాన్ని ధరణి రికార్డులో ప్రొహిబిటెడ్ లిస్టులో నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎప్పటికైనా ఈ భూమి కళాశాలదే అని స్పష్టం చేశారు. యూకో బ్యాంకులో అరోరా ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాల 26.15 ఎకరాల భూమి మీద తీసుకున్న రుణం అరోరా కళాశాల యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ రుణానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కర్షక్ బీఈడీ కళాశాలను వెంటనే ప్రభుత్వం స్వాధీన పరచుకుని ప్రభుత్వ బీఈడీ కళాశాలగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. శిశు మందిర్ పాఠశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ బాలుర వసతి గృహానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల జోలికి ఎవరు వచ్చినా వాళ్ళ ఇంటి ముందు ఆందోళన చేస్తామని, ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని కబ్జాదారులను ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నామన్నారు. కళాశాల భూములు కాపాడుటకై కామారెడ్డిని ఎడ్యుకేషనల్ హబ్ గా తయారు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ని కలిసి ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, న్యాయ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాల ఏర్పాటుకు ఉద్యమిస్తామన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బిడిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఎన్ ఆజాద్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్, బివిఎం రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విట్టల్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాలు, బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, బి డి ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, బివైఎం జిల్లా అధ్యక్షులు బుల్లెట్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు రిత్విక్ పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

నవతెలంగాణ-బాన్సువాడ



విద్యార్థులతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి

పట్టణంలోని బీఎస్సీ నర్సింగ్ కాలేజీని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. నూతన కాలేజీ, హాస్టల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. నర్సింగ్ విద్యార్థినులతో సమావేశమైన పోచారం విద్యార్థినులకు అందుతున్న హాస్టల్ సౌకర్యాలపై వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థినులను మంచిగా చూసుకోవాలని వార్డెన్ కు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే స్వయంగా నన్ను కలవాలని పోచారం గారు విద్యార్థినులకు తెలిపారు. అనంతరం కాలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ ప్రెసిడెంట్ హోదాలో పోచారం ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కాలేజీని సందర్శించి అటానమస్ (స్వతంత్ర హోదా) పొందడంపై హర్షం వ్యక్తం చేశారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ

నవతెలంగాణ-బోధన్

చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బోధన్ పట్టణంలోని యాచకులకు దుప్పట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని మారుతి మందిరం వద్ద, ఆర్టీసీ బస్టాండ్, శివాలయం వద్ద, పంచవటి సూపర్ మార్కెట్ వద్ద, జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద గల యాచకులు చలికి ఇబ్బందులు పడుతుండడంతో వారికి దుప్పట్లను పంపిణి చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జాదవ్ ప్రవీణ్ నాయక్, ఉప్పరి శ్రీకాంత్, ముత్యాల సందీప్, యెశాల సూరి, సందీప్, కన్నడి ప్రవీణ్, మహేష్ గౌడ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన


మాట్లాడుతున్న సిడిపిఓ సుధారాణి

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలలకు బాలల హక్కులపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. బాలల చట్టాలపై సిడిపిఓ సుధారాణి అవగాహన కల్పిస్తూ... బాల్యం వివాహాలు, నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధవహిస్తూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రతి విద్యార్థి షీ టీం పై అవగాహన కలిగి ఉండాలని పోలీస్ శాఖ సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఏసి డిపిఓ జ్ఞానేశ్వరి, ఉషారాణి అంగన్వాడీ టీచర్లు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుని దర్శించుకున్న వేముల దంపతులు


తిరుమలేశుని దర్శించుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సోదరుడు వేముల అజయ్ రెడ్డి దంపతులు, కుమారుడు పూజిత్ రెడ్డి దంపతులు సైతం దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి వేడుకొన్నారు.

పాఠశాలకు 'కంప్యూటర్' వితరణ


పాఠశాలకు కంప్యూటర్ అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ గ్రామ వాస్తవ్యులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు నునుగొండ అంజయ్య బుధవారం మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాలకు 'కంప్యూటర్'ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయ బృందం వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్క మల్లుబాయి- గంగాధర్, వేంపల్లి సొసైటి ఛైర్మన్ జక్కరాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు సాంబారు లక్ష్మీ నారాయణ, ఎస్ఎంసీ ఛైర్మన్ పిప్పెరగణేష్, ప్రముఖ వ్యాపార వేత్త సాగర్ రెడ్డి, కనకయ్య, యూత్ సభ్యులు లక్ష్మణ్ యాదవ్, ఉపాధ్యాయులు సతీష్, సరిత, సీఆర్పీ సతీష్, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు..

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత


మంత్రిని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

అనారోగ్యం కారణంగా యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు.

నర్సరీల పరిశీలన


నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని చక్రధర్ నగర్ తండా, మల్కాపూర్ తండా, మల్కా పూర్ (ఎం) గ్రామాల్లో నర్సరీలను డిఆర్డిఓ పీడీ బదావత్ చందర్ నాయక్ నాయక్ బుధవారం సందర్శించారు. ఏ శాతం లో నీటిని, మట్టిని కలపాలి అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేష్, కొత్త పేట సర్పంచ్ లావణ్య ప్రవీణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పెంటాఖుర్దులో బడిపిల్లల సర్వే


సర్వే నిర్వహిస్తున్న విద్యాధికారులు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు బడిబాట పిల్లల సర్వే నిర్వహించారు. పెంటాఖుర్దు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రత్నాకరం గ్రామంలో బడి బయట విద్యార్థుల సర్వే నిర్వహించి బడికి రాని ముగ్గురని గుర్తించి పాఠశాలలో చేర్పించారు. ఈనెల 11 నుండి జనవరి 10 వరకు పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో బడిబయటి పిల్లల సర్వే నిర్వహించడం జరుగుతుందని హెచ్ఎం రత్నాకర్ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ విజయ్, రేఖ, ఉపాధ్యాయుడు పరశురాం పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి బాటలు వేస్తా

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నగర అభివృద్ధిపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగర అభివృద్ధిపై అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారా యణ బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమీక్ష సందర్భంగా నగరంలో వివిధ పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులు, ఆయా నిధులతో కొనసాగుతున్న ప్రగతి కార్యక్రమాల గురించి కమిషనర్ ఎం.మకరంద్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు పూర్తి సహకారం అందించాలని అన్నారు. ఇటీవలే తాను ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించిన సందర్భంగా ప్రజల నుండి విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, ఉద్యానవనాలు, ఐలాండ్స్, బస్తీ దవాఖానాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు వంటి మౌలిక వసతులకు సంబంధించి అనేకమంది విజ్ఞాపనలు చేశారని శాసనసభ్యులు ధన్పాల్ తెలిపారు. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు రానున్న ఐదేళ్ల కాలం పాటు స్థానికంగానే అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని ఎమ్మెల్యే తన సంకల్పాన్ని వెల్లడించారు. అధికారుల సహకారం ఉన్నప్పుడే ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు వీలవుతుందని, ఈమేరకు అన్ని శాఖల అధికారులు తోడ్పాటును అందించాలని సూచించారు. క్రమం తప్పకుండా సమీక్షలు జరుపుతూ నగర అభివృద్ధికి బాటలు వేస్తానని అన్నారు. ప్రజల నుండి వచ్చే సమస్యలు, వినతులపై తక్షణమే స్పందిస్తూ, నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, ట్రాన్స్కో ఎస్.ఈ రవీందర్, డీ.ఈ.ఓ దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూపతిరెడ్డికి సన్మానాలు



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానించిన మారయ్యగౌడ్, డాక్టర్లు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

బైపాస్‌రోడ్డులోగల ఎమ్మెల్యే భూపతిరెడ్డి నివాసంలో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత చైర్మన్ మారయ్య గౌడ్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్లు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్ బృందం కలిసి సన్మానించారు.

జక్రాన్‌పల్లి: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మునిపల్లి గ్రామ ప్రజలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ముని పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే భూపతిరెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ముని పల్లి సాయి రెడ్డి, గ్రామ సర్పంచ్ చిన్న సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని ఎస్సైకి ఫిర్యాదు


ఎస్సైకి వినతి పత్రాన్ని అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

నవ తెలంగాణ-నవీపేట్

మండలకేంద్రంలోని బాలికల హైస్కూల్, మోడల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాలలో చదివే విద్యార్థినిలపై ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేవైఎం ఆధ్వర్యంలో ఎస్సై యాదగిరి గౌడ్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షులు భానుగౌడ్ మాట్లాడుతూ.. ఆకతాయిలు బైక్‌లపై త్రిబుల్ రైడ్ చేస్తూ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినిలు మనోవేదనకు గురవుతున్నారని వెంటనే పోలీస్ శాఖ చర్యలు చేపట్టి చట్టపరంగా శిక్షించాలని లేనియెడల బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్, గంగోనీ లక్ష్మణ్, చరణ్ రెడ్డి, రాజేందర్ గౌడ్, రాకేష్, వినీత్, గంగోని రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష


మాట్లాడుతున్న సర్పంచ్ రమేష్

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించినట్లు సర్పంచ్ ఎంఎస్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. గత సంవత్సర కాలంలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన సామాజిక తనిఖీ బృందాలతో సర్వే జరిపించారు. రేపు జరిగే గ్రామ సభలో ఉపాధి హామీ అధికారుల సమావేశం జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేందర్ రావు, ఏపీవో రమణ, ఇందిరా రెడ్డి, సగ్గు వెంకటి క్షేత్ర సహాయకులు శోభన్ ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

తాడి బిలోలి గ్రామంలో..

మండలంలోని తాడి బిలోలి, నీల, పేపర్ మిల్ గ్రామాల్లో సర్పంచులు వెలుమల సునీత నరసయ్య, గౌరాజీ లలిత రాఘవేందర్, హాలియా ఫారుక్ పటేల్ ఆధ్వర్యంలో గ్రామ సభలో పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది మధు, నారాయణ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు


మాట్లాడుతున్న సహకార సంఘం నేతలు

నవతెలంగాణ-మోర్తాడ్

రెండు రోజులుగా కాంగ్రెస్ నాయకులు బాల్కొండ నియోజకవర్గంలోని 20 సహకార సంఘాల్లో బాకీలు పేరుకుపోయాయంటూ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని సహకార సంఘం నేతలు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని సహకార సంఘంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏ మేరకు బాకీలు ఉన్నాయో తెలుసుకొని ఇప్పటి బాకీలను సరి చేసుకోవాలంటూ తెలిపారు. 2020 నాటికి సహకార సంఘాలు పూర్తిగా నష్టాలతో ఉండగా ప్రస్తుతం వాటిని చెల్లిస్తూ రైతులకు సేవ చేస్తున్నామని అన్నారు. మార్క్ ఫెడ్ యూరియా కంపెనీల వద్ద ఏ మేరకు డబ్బులు చెల్లించాల్సి ఉందో వాటిని తెలుసుకొని మాట్లాడాలని, తప్పుడు ఆరోపణలు సరికాదని అన్నారు. గత ప్రభుత్వాలు సహకార సంఘాలకు ఏ మేరకు సప్లై చేశారో అదేవిధంగా ప్రస్తుత అధికార ప్రభుత్వం సైతం సహకార సంఘాలకు యూరియా సప్లై చేసే విధంగా సహకరించాలని సహకార సంఘం చైర్మన్లు డిమాండ్ చేశారు. సహకార సంఘాలు నష్టాల్లో ఉంటున్నాయి అంటూ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని, అలాంటివి మానుకోవాలని హితవు పలికారు.

ఎమ్మెల్యే భూపతిరెడ్డికి చిత్రపటం బహూకరణ


పెయింటింగ్ వేసిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిత్రపటాన్ని అందజేస్తున్న యువజన విభాగం నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి మండల యువజన విభాగం ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి ఆయన చిత్ర పటాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో చిత్రపటాన్ని ఎమ్మెల్యేతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రూరల్ యువజన విభాగం అధ్యక్షులు ఉమ్మాజి నరేష్, జక్రాన్‌పల్లి మండల యువజన విభాగం అధ్యక్షుడు సొప్పరి వినోద్, జిల్లా మాల మహానాడు యువజన విభాగం అధ్యక్షుడు కిరణ్ అనుపాల్, జిల్లా ఓబిసి సెక్రెటరీ నక్కల నవీన్, జిల్లా జనరల్ సెక్రెటరీ గన్న లక్ష్మణ్, మండల యువజన విభాగం ఉపాధ్యక్షులు మున్నూరు ప్రణయ్, నాయకులు పాల్గొన్నారు.

అంగడి బజార్లోని సమస్యలను పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని అంగడి బజార్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. పట్టణంలో రైతు బజార్ (అంగడి బజార్) ను మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌తో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతు బజార్లోని మరుగుదొడ్లను, అస్తవ్యస్తంగా మారిన మడిగెలను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే అన్ని సదుపాయాలు తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్ల కోసం వాడాల్సిన వాటిని తాళాలు వేసి ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని, అంగడి బజార్ రూపురేఖలను త్వరలోనే మారుస్తామని, అన్ని వసతులు అందుబాటులోకి తెస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, పట్టణ అధ్యక్షులు ద్యాగ ఉదయ్, జెస్సు అనిల్, జాగిర్దర్ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్షల రూపాయల నిధులతో మందర్నా అభివృద్ధి

- సర్పంచ్ రావుబా గంగాధర్


రావుబా గంగాధర్


గ్రామ పంచాయతీ కార్యాలయం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని మంజీర పరివాహక గ్రామం అది. గతంలో ఎటువంటి అభివృద్ధి లేక గ్రామ ప్రజలు ఎన్నో అవస్థలు ఎదుర్కొనేవారు. సరయిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడేవారు. కాని తెలంగాణ ప్రభుత్వ హయాంలో 2019లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన యువకుడు రావుబా గంగాధర్ గ్రామ అభివృద్దే లక్ష్యంగా ఎన్నో పనులు చేపట్టారు. తన ఐదేళ్ల పదవీ కాలంలో గ్రామస్తుల సహకారం, గ్రామ పెద్దల సలహాలతో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచ్ రావుబా గంగాధర్ నవతెలంగాణకు తెలిపారు.

మందర్న గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు..

35 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం. 15 వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్ఎఫ్‌సీ నిధుల ద్వారా మంజూరయిన 20 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం. 12 లక్షలతో వైకుంఠధామం. 2.5 లక్షలతో కంపోస్టు షెడ్ నిర్మాణం. పాఠశాలలో మన ఊరు- మనబడి పథకంలో అలాగే ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 22 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు ఇంకా మిగిలిన పనులకు నిధులు అవసరం కురుమ సంఘ భవన నిర్మాణానికి 5లక్షలు మొరం రోడ్డు కోసం 7.5 లక్షల రూపాయల మంజూరు అయినట్లు సర్పంచ్ రావుబా గంగాధర్ తెలిపారు. అలాగే కుల వృత్తిలో భాగంగా కురుమ సంఘ సభ్యులకు 88 యూనిట్ల గొర్లు, 50 మందికి కల్యాణలక్ష్మీ చెక్కులు, 10 మంది బాధిత కుటుంబాలకు 50 లక్షల రూపాయల రైతుభీమా ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. 299 మందికి కేసీఆర్ కిట్, 30 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం, గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగుపరచడం, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీటి సౌకర్యాలు కల్పించామని చెప్పారు. ముగ్గురికి బీసీ బంధు ,ఒకరికి దళిత బంధు పథకం మంజూరి చేసినట్లు సర్పంచ్ తెలిపారు. హూన్స-మందర్న- సుంకిని వరకు బీటీ రోడ్డు పనులకు 9.80 కోట్ల రూపాయలు మంజూరు కావడంతో పనులు జరుగుతున్నాయని, అలాగే గ్రామాభివృద్ధిలో భాగంగా ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో సరస్వతి విగ్రహం, ఆలయ నిర్మాణానికి తనవంతు ఆర్థిక సహాయం చేయడం జరిగిందని, తనతో పాటు గ్రామ అభివృద్ధిలో ఉప సర్పంచ్ సాగర్ బాయి, కార్యదర్శి శ్రీనివాస్‌ల సహకారం, గ్రామ పెద్దల కృషి ఉందని సర్పంచ్ రావుబా గంగాధర్ పేర్కొన్నారు.

పంటల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రాజు

నవతెలంగాణ-మద్నూర్

ఉమ్మడి మండల వ్యవసాయ అధికారి రాజు రెండు మండలాల పరిధిలో శనగ పంట తదితర పంటలను బుధవారం పరిశీలించారు. శనగ పంటలో ఎర్ర తెగుళ్ల నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ రైతులతో మాట్లాడుతూ నష్టాలకు గురయ్యే పంటలకు రక్షించుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. పంటల పరిశీలన కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు. మద్నూర్, డోంగ్లి మండలాల్లో మండల వ్యవసాయ అధికారి రాజు క్షేత్రస్థాయిలో సాగు అవుతున్న, మినుము శెనగ, కంది పంటలను పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు అందజేశారు.

శవ యాత్ర రథం వితరణ



వవవవవ

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని మల్లుర్ గ్రామంలో భుజంగారి వెంకటరామిరెడ్డి గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు భుజంగారి భాస్కర్‌రెడ్డి శవయాత్ర రథాన్ని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు చేతుల మీదుగా గ్రామానికి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ భాస్కర్ రెడ్డి గత 20 రోజుల నుండి గ్రామనికి తన వంతు సహాయంగా ఈ రథం వితరణ చేస్తానని నా దృష్టికి తీసుకొచ్చాడని ఆయన తెలిపారు. ప్రతి ఒక్క యువకుడు కూడా పలు సేవా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దళితబంధు కమీషన్ రాబడుతా

- ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలో పైలెట్ ప్రాజెక్టు భాగంగా దళితబంధు పథకం ఎన్నో అవకతవకలు జరిగాయని ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు అన్నారు. ఆ అవకతవకలన్నిటిని గుర్తించి కలెక్టర్, మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రతి దళితునికి న్యాయం జరిగేలా చూస్తానని, ఎవరైతే ఎంతెంత కమీషన్ తీసుకున్నారో ఆ కమీషన్ మొత్తం దళితులకు పంచుతా అని అన్నారు. మండల కేంద్రంలోని మల్లూరు, మల్లూరు తండా, నిజాంసాగర్ గ్రామాలలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గెలుపు కోసం కృషిచేసిన ప్రతి కార్యకర్తకు అన్యాయం జరగనివ్వనని వారికి కంటికి రెప్పలా చూసుకుంటానని హామీ ఇచ్చారు. తన గెలుపు కోసం కృషి చేసి శ్రమించిన ప్రతి కార్యకర్తకు పాదాభివందనం ఈ సభ ద్వారా చేస్తున్నా అని అన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని, అన్ని పనులను కొన్ని రోజులలో ప్రారంభిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాయిపటేల్ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి యువజన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకాష్ బింగి శేఖర్, పెద్ది హన్మండ్లు, బుడమే మైసయ్య కాంగ్రెస్ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

పిట్లం: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి మందిరంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాముల ఆహ్వానం మేరకు విచ్చేసి స్వామి మందిరములో ప్రత్యేక పూజ పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు , కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ సమావేశం

నవతెలంగాణ-కామారెడ్డి

నేడు మధ్యాహ్నం 3-00 గంటలకు కామారెడ్డి పట్టణంలోని సత్య గార్డెన్ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు ఒక ప్రకటన తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి మహ్మద్ అలీ షబ్బీర్, వీరితోపాటు మాజీ విప్ ఇరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నిజామాబాద్ డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర మాజీ మహిళా అధ్యక్షురాలు నేరెళ్ల శారద, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి హాజరు కానున్నట్టు తెలిపారు. ఇట్టి ఆత్మీయ సమ్మేళనానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్యులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును సన్మానిస్తున్న స్వాములు

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును బుధవారం లింగంపేట్ అయ్యప్ప స్వాములు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శాలుకప్పి ఘనంగా సన్మానించారు. ఈనెల 15న లింగంపేట్ మండల కేంద్రంలోని రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది మమ్మద్ మోహినమ్మకాద్రి ఫంక్షన్‌హాల్‌లో మహా పడిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈనెల 15 సాయంత్రం 6 గంటల 30 నిమిషాల నుండి మహా పడిపూజ ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన స్వాములు అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి చంద్రమౌళి, గురుస్వామి రాజిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పశుపతి, నగేష్, లక్ష్మీనారాయణ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు నారా గౌడ్, దురిశెట్టి అశోక్, గాంధారి మండల అధ్యక్షుడు తూర్పురాజు భాస్కర్ గౌడ్ తదితరులున్నారు.

రోడ్డున పడుతున్నాం..

రెడ్డిపేటలో ఆటో డ్రైవర్ల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డి పేటలో బుధవారం ఆటో డ్రైవర్లు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. బస్సులు, వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం మహిళకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం మంచి పరిణామమైన, పొద్దస్తమానం ఆటోను నడిపిస్తేనే కుటుంబ జీవనం గడుస్తుందని, ప్రయాణికులు లేక జీవనం గడపడమే గగనంగా మారిందని, నెల నెల కట్టే ఈఎంఐలు కట్టె పరిస్థితి లేదని వాపోయారు. ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు జి స్వామి గౌడ్, సాయిరాం గౌడ్, రమేష్, రాజు, జావిద్, రాంచందర్, బిఆర్ఎస్ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తె, మట్టెలు అందజేత



పుస్తె మట్టలు అందజేస్తున్న మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

నారెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా బుధవారం మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన మాదాసు రాజారాం కుమారుని వివాహానికి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు నా రెడ్డి మోహన్ రెడ్డి పుస్తె మట్టెలు అందజేశారు. కార్యక్రమంలో నా రెడ్డి రాజిరెడ్డి, నా రెడ్డి లింభారెడ్డి, గిరెడ్డి కృష్ణారెడ్డి, పోతుల భాస్కర్ రెడ్డి, నా రెడ్డి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కంగ్రెస్ కార్యకర్తలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె మదన్ మోహన్‌రావ్ గెలుపొంద టంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మొక్కులు తీర్చుకుం టున్నారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వాములకు కురుమ సాయిబాబా, నాగం గోపి కృష్ణ ఆధ్వర్యంలో కలసి బిక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండలంలో గల అయ్యప్ప స్వాములు పాల్గొనడం జరిగింది.

విజేతలుగా నిలిచిన భిక్కనూర్ దివ్యాంగులు



విజేతలుగా భిక్కనూర్ దివ్యాంగులు

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం లో నిర్వహించిన దివ్యాం గుల పోటీలో భిక్కనూరు మండలానికి చెందిన 12 మంది దివ్యాంగులు ప్రతిభ కనబరిచారు. గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ పి మహేందర్, పిటి శ్రీవాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాచార శాఖలో డబ్బుల్ నిల్

- బిల్లులు చెల్లించకపోవడంతో డీపీఆర్‌వోకు ఆగిన దినపత్రికలు
- రెండేండ్లుగా నిలిచిన చెల్లింపులు



నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలు ప్రధానంగా వివిధ వార్త పత్రికల్లో వచ్చిన వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమాచారం శాఖది కీలక పాత్రం. ఇందుకోసం ఆ శాఖ.. పలు వార్త పత్రికలను వేయించుకుంటూ.. వాటిలోని ప్రధాన సమస్యల క్లిప్పింగులను సంబంధిత శాఖల అధికారికి, కలెక్టర్‌కు చేరవేస్తుంటుంది. ఇంత ప్రాధాన్యమున్న శాఖకు నిధులు లేవు. రెండేండ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో వార్తపత్రికలు వేయడం లేదు. దీంతో ప్రజాసమస్యలు అధికారుల దృష్టికి వెళ్లకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండే అవకాశం ఉంది. రెండు సంవత్సరాలుగా పేపర్ బిల్లులు చెల్లించక పోవడంతో సదరు పేపర్ ఏజెన్సీ నిర్వాహకులు పేపర్ డిపిఆర్ఓ ఆఫీస్‌లో వేయడం నిలిపివేశారు. దీంతో జిల్లాలో ఏమి జరుగుతుందో అధికారులకు, కలెక్టర్‌కు తెలిసే అవకాశం లేకుండా పోనుంది.

తలసేమియా చిన్నారుల కోసం

నేడు మెగా రక్తదాన శిబిరం

- కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పంచాయతీ అధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

తల సేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం నేడు(గురువారం) మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. కర్షక్ బి.ఎడ్ కళాశాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 02 గంటల వరకు నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాలను జిల్లా పంచాయితీ అధికారి సాయిబాబా తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబు, ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ప్రతి 15 నుండి 20 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం ఉంటుందని, అలాంటి చిన్నారులకు రక్తం దొరకకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని వారి ప్రాణాలను కాపాడడం కోసం ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరానికి రక్తదాతలు తరలిరావాలని అన్నారు. ఒక రక్తదాత ఇచ్చే రక్తంతో ఒక చిన్నారి ప్రాణాలను 15 రోజులపాటు కాపాడవచ్చునని రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు డాక్టర్ వేదప్రకాష్, ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్,ఉపాధ్యక్షులు జమీల్ హైమద్,డాక్టర్ పుట్ల అనిల్,కిరణ్,రమణ,ఎర్రం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల, సంస్థల నుంచి నామినేషన్ల ఆహ్వానం



నవతెలంగాణ-కామారెడ్డి

2023 సంవత్సరానికి వివిధ రంగాలలో నిష్ణాతులై అత్యంత ప్రతిభ కనబరుస్తూ ఐదు సంవత్సరాలకు పైగా విశిష్ట సేవలు అందించిన ప్రముఖ క్రైస్తవ వ్యక్తులు, సంస్థలను సత్కరించడం కోసం తెలంగాణ రాష్ట్ర క్రిష్టియన్ (మైనారిటీస్) ఫైనాన్స్ కార్పొరేషన్ చర్చిలు, క్రైస్తవ సంస్థలు, కమ్యూనిటీ నాయకులు, క్రైస్తవ వ్యక్తుల నుండి నామినేషన్లను ఆహ్వానిస్తున్నదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, అక్షరాస్యత సాధన, సాహిత్యం , కళలు, క్రీడలు, సామజిక సేవా కార్యక్రమాలలో విశిష్ట సేవలు చేసిన వారిని సన్మానించనుందని తెలిపారు. అదేవిధంగా విద్య, వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలలో 30 సంవత్సరాలకు పైగా విశిష్ట సేవలందిస్తున్న క్రిష్టియన్ ఆర్గనైజేషన్లు, సంస్థలను క్రిస్టమస్ పండుగ సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న వేడుకలలో గుర్తించిన సంస్థలు, వ్యక్తులను సన్మానించనుందని కలెక్టర్ తెలిపారు. నామినేషన్లు సమర్పించదలచుకున్న సంస్థలు, వ్యక్తులు హైదరాబాద్ లోని మేనేజింగ్ డైరెక్టర్, తెలంగాణా రాష్ట్ర క్రైస్తవ ఫైనాన్స్ సంస్థ నుండి వ్యక్తిగతంగా లేదా %www.tscmfc.in% వెబ్ సైట్ నుండి నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని డౌన్ లోడ్ చేసుకొని పూర్తి చేసిన నామినేషన్లను కామారెడ్డి కలెక్టరేట్ లోని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయం, రూమ్ నెంబర్ 222 నందు ఈ నెల 15 న సాయంత్రం 5 గంటలలోగా అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 040-23391067 నెంబరును సంప్రదించవలసినదిగా కలెక్టర్ తెలిపారు.

భూ కబ్జాదారులపై అధికారుల చర్యలు లేనట్టేనా?



మాట్లాడుతున్న గ్రామ వార్డు సభ్యులు

నవతెలంగాణ-రాజంపేట్

రాజంపేట్ మండల కేంద్రంలోని, 569, 575, 576 సర్వే నంబర్‌లో గల భూమిని కొంతమంది బడా నాయకులు కబ్జాలు చేసి వారి చేతి వాటాన్ని చూపారని రాజంపేట గ్రామ వార్డు సభ్యులు కొప్పుల నరేష్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గత కొంతకాలంగా ఈ సర్వే నంబర్లలో బడా నాయకులు కబ్జాలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన వాపోయారు. బోరుగడ్డ ప్రాంతంలో అనేక భూములు కబ్జాలకు పాల్పడుతున్నారని అధికారులకు విన్నవించిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. కబ్జాదారుల చేతిలో భూములు నిరుపేదలకు దక్కేవరకు పోరాటం చేస్తామని దీనికి గాను గ్రామ యువకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సహకుందాలని అన్నారు. శ్రీ వెంకటేశ్వర అలయ భూములు, సంగమేశ్వర ఆలయ భూములు కబ్జాలకు గురి అవుతున్నాయని గ్రామ అస్తులను కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉందని అన్నారు. నేటి నుండి మండల కేంద్రంలో రోజు వారి కార్యచరణ ప్రకటిస్తామని శాంతి యుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. వందల ఎకరాల గల భూములు కొంత మంది చేతిలో ఉన్నాయని వాటిని స్వాధీనం చేసుకొని పేదలకు పంచి పెట్టాలని అయన డిమాండ్ చేశారు.

దివ్యాంగుల గొంతుక కావాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వికలాంగులు

నవతెలంగాణ-కామారెడ్డి

అసెంబ్లీలో మాట్లా డేందుకు దివ్యాంగుల గొంతుక కావాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ కోరారు. బుధవారం విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి మార్యద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానం చేసి దివ్యాంగుల సంక్షేమ కోసం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిప్ప దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నిండు అసెంబ్లీలో దివ్యాంగుల సమాజం కోసం ప్రశ్నించే గొంతుకగా మీరు కావాలని, రాష్ట్రంలో ఉండే దివ్యాంగుల సమాజం కోసం నిలబడాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దివ్యాంగుల కోసం మేనిఫెస్టోలో 29వ అంశంగా పేర్కొన్న 2016 వికలాంగుల చట్టం తెలంగాణలో పూర్తిస్థాయిలో అమలయలా చూస్తామని, దివ్యాంగుల నెలవారి పెన్షన్ 6000 లకు పెంచుతామన్నారు, ప్రభుత్వ శాఖల్లో రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో పటిష్టంగా అమలు చేస్తూ బ్యాక్ లగ్ పోస్టులను భర్తీ చేస్తాం, దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తామని ఆ 29వ అంశంలో పేర్కొన్నారని వాటిని అమలయ్యే విధంగా అసెంబ్లీలో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ పంగ ఈశ్వర్, సబ్ కమిటీ డైరెక్టర్ గాడి నర్సింలు, జిల్లా నాయకులు రంగ్యానాయక్, రాజమౌళి, పురం శంకర్, స్వామి, కొండల్ రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-దోమకొండ

కామారెడ్డి నియోజకవర్గంలోని ఆలయల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని కామారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి అన్నారు. దోమకొండ మండల కేంద్రం లోని అయ్యప్ప ఆలయం వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కామారెడ్డి నియోజకవర్గం లోని ఆలయల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తనని అన్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి ని శాలువా తో సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, ఎంపీపీ శారదా నాగరాజు, సర్పంచ్ అంజలి, అయ్యప్ప ఆలయం కమిటీ సభ్యులు మోహన్ రెడ్డి, సాయి రెడ్డి, సంతోష్,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లల సర్వే



సర్వే నిర్వహిస్తున్న విద్యాధికారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలం ఓఎస్సీ సర్వేలో భాగంగా గురువారం అజామాబాద్ గ్రామంలో ముగ్గురు బాలికలు ఒక బాలురు బడి బయట ఉన్న పిల్లలను సిఆర్‌పి మహిపాల్ గుర్తించి బాలికలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అన్నసాగర్‌లో, బాలురను ప్రాథమిక పాఠశాల అజామాబాదులో జాయిన్ చేసినట్టు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రతిరోజు పాఠశాలకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాల అన్నాసాగర్ ప్రధాన ఉపాధ్యాయులు విగ్నేశ్వర్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే పోచ గౌడ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ



సరుకుల పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణానికి చెందిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పురాం రాజమౌళి హైదరాబాదులోని ఘటకేసర్ ప్రాంతానికి చెందిన అమ్మ నాన్న అనాధ సేవా ట్రస్ట్ వృద్ధాశ్రమానికి నిత్యవసర సరుకులను ట్రస్టు నిర్వాహకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు అనాథ వృద్ధులకు తన వంతు సహాయం చేసినందుకు వైస్ చైర్మన్ కు ధన్యవాదాలు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్



నవతెలంగాణఆర్మూర్

టీఎస్ ఆర్టీసీ బస్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సుచరిత్ నిజాయితీని చాటుకున్నారు. రెండు రోజుల క్రితం ఆర్మూర్ నుండి నందిపేట్ వెళ్తున్న బస్సులో విధులు నిర్వహిస్తూ ఉండగా ప్రయాణికుడు మొబైల్ ఫోన్, పర్స్ పోగొట్టుకోగా తిరిగి ఇచ్చేశారు. బుధవారం ఆర్మూర్ డిపో నుండి వేల్పూర్ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలు పర్స్ బస్సులో మరిచిపోయి వెళ్లగా ప్రయాణికురాలికి ఆ పర్సు అందించారు. అందులో అరతులం బంగారు ఉంగరం, 3800 డబ్బులు ఏటీఎం, పాన్ కార్డులను ప్రయాణికురాలికి అందిచారు. నిజాయితీ చాటుకున్న కండక్టర్ సుచరిత్ కి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

220గ్రాముల గంజాయి పట్టివేత



నవతెలంగాణ-ఆర్మూర్

నూతన ఆలూరు, దేగామా రోడ్డు మార్గంలో గస్తీ నిర్వహిస్తుండగా ఆలూరు పల్లె ప్రకృతి వనం సమీపంలో రాజేష్ ముఖ్య అను వ్యక్తి గంజాయి ప్యాకెట్స్ అమ్ముతున్నారనే సమాచారం మేరకు ఆర్మూర్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది బుధవారం పట్టుకున్నట్టు ఎక్సైజ్ సీఐ స్టీవెన్సన్ తెలిపారు. అనుమానాస్పదంగా కనిపించిన రాజేష్ ముఖ్య అనే వ్యక్తిని పట్టుకొని తనిఖీ చేయగా ఆయన వద్ద గంజాయి ముఠా లభించిందని అన్నారు. ఆయన్ను అరెస్టు చేసి ఎక్సైజ్ స్టేషన్ కు తరలించి 220 గ్రాముల గంజాయిని సీజ్ చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. తనిఖీలో ఆర్మూర్ సబ్ ఇన్స్పెక్టర్ ఏ గంగాధర్, ప్రమోద్ చైతన్య హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ గౌడ్ కానిస్టేబుల్స్ దేవిదాస్ , సాయిబాబా గౌడ్, గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్మూర్ మున్సిపల్‌లో అసమ్మతి సెగ

- కౌన్సిలర్లు, చైర్పర్సన్‌కు మధ్య ముదిరిన వివాదం
- అవిశ్వాసం పెట్టాలంటున్న సొంతపార్టీ కౌన్సిలర్లు



నవతెలంగాణ-ఆర్మూర్

గత కొన్ని నెలల నుండి పట్టణ కౌన్సిలర్లకు చైర్ పర్సన్‌కు మధ్య ముదిరిన వివాదం చిలికి చిలికి గాలి వానలా తయారై తీవ్ర వివాదానికి దారి తీసింది. తాజాగా మంగళవారం 26 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని కోరారు.

నాలుగు సంవత్సరాల నుండి..

మున్సిపాలిటీలో మెజారిటీ స్థానాలు గెలుచుకున్న బీఆర్ఎస్ చైర్ పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకొని మున్సిపల్ చైర్ పర్సన్‌గా పండిత్ వినీత బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత పాలన మొత్తం ఆమె భర్త పవన్ ఆయన తమ్ముడు ప్రేమ్ చేతుల్లోకి వెళ్లిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్లుగా ఉన్న శైలజ, జగదీశ్వర్ గౌడ్, ప్రస్తుతం ఉన్న ప్రసాద్ చౌహాన్‌లతో వివాదాలు జరిగాయి. తమకు సమాచారం ఇవ్వకుండా వెళ్ళొద్దని హుకుం జారీ చేశారు. తాము చెప్పిందే వేదంగా సమావేశాల్లో ఎజెండా అంశాలను పొందుపరచాలని ఆదేశించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లు ఉన్నారు వీరిలో టిఆర్ఎస్కు చెందినవారు 23 ఉండగా బిజెపి ఆరు, కాంగ్రెస్ ఒకటి, ఎంఐఎం ఒకటి స్వతంత్రులు ఐదుగురు ఉన్నారు. చైర్మన్ ఎన్నిక సమయంలో ఇద్దరు స్వతంత్రులతో పాటు మరికొంతమంది బీఆర్ఎస్ లో చేరడంతో పండిత్ వినీత చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్ ల పదవీకాలం 20 25 జనవరి 28 వరకు 14 నెలల వరకు ఉంది. గత రెండున్నర సంవత్సరల కింద బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ అప్పటి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వద్దకు వెళ్లగా వద్దని నచ్చజెప్పి పంపినాడు. అప్పటినుండి ఇప్పటివరకు షాడో చైర్మన్‌కు, బీఆర్ఎస్ కౌన్సిలర్లకు మధ్య వాటాల పంపిణీలో తేడాలు రావడం కౌన్సిలర్ల భర్తలు మున్సిపల్ ఛాంబర్‌లోనే వాగ్వేదానికి దిగిన సందర్భాలు మాయని మచ్చలా మిగిలాయి. తమ వార్డుల్లో చేసే పనులకు నేరుగా కమిషన్లు తీసుకోవడం మున్సిపల్‌లో ఔట్‌సోర్సింగ్‌లో జరిగిన నియామకాల్లో భారీగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు వినిపించాయి. ట్రాక్టర్ల ఆటోల కొనుగోనుళ్ల డబ్బులు మింగారని కౌన్సిలర్లే ఆరోపించడం అప్పట్లో తీవ్ర సంచలనం రేపింది. తాజాగా ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు ఇచ్చి చైర్మన్లు డబ్బులు తీసుకున్నారని ఆరోపణలను వెల్లివెత్తాయి.

నాలుగు సంవత్సరాల క్రితం ఐదు లక్షలతో మున్సిపల్ ఆఫీసుకు రిపేరు చేయగా, మళ్లీ ఆరు నెలల క్రితమే పది లక్షలతో మరోసారి వాస్తు పేరుతో రిపేరు చేయడంపై కౌన్సిలర్లు మండిపడ్డారు. ఇదిలా ఉండగా అవిశ్వాసానికి సపోర్టు చేసేవారికి ప్యాకేజ్ ఇస్తామంటూ బీ ఆర్ఎస్ కౌన్సిలర్లతో ఆశావాహులు చర్చలు జరిపినట్టు సమాచారం. ఇతరులు ఇచ్చిన దానికంటే తాము 50వేలు ఎక్కువే ఇస్తామని, ఎలాగైనా చైర్పర్సన్ సీటును ఆశిస్తున్న ఓ కౌన్సిలర్ భర్త, కౌన్సిలర్లు గెట్ టుగెదర్ లో చెప్పినట్టు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ ఒక సంవత్సరం పాలన కోసం సుమారుగా కోటి ఖర్చు చేసుకునే వారికే మున్సిపల్ చైర్ పర్సన్ సీటు దక్కేలా కనిపిస్తుండడంపై సర్వత్ర ఉత్కాంత నెలకొంది. అవిశ్వాసం నోటీసు చైర్మన్‌పై ఇవ్వడంతో 15 రోజులు వేచి చూసి ఆలోపు నిర్ణయం మార్చుకోకుంటే మళ్లీ సభ్యులందరికీ నోటీసులు ఇస్తారు. నెల రోజులలోపు మున్సిపల్ సమావేశాన్ని కమిషనర్ లేదా ఆర్డిఓ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఆ సమావేశంలో రెండు బై మూడు వా వంతు సభ్యులు హాజరై అవిశ్వాసాన్ని బలపరిస్తే ప్రభుత్వానికి పంపిస్తారు. ప్రస్తుతం బీఆర్ఎస్ కౌన్సిలర్లు నోటీసులు ఇవ్వడం వల్ల నిబంధనల మేరకు నెల రోజుల్లోపు చైర్మన్‌పై నిర్ణయం తీసుకోనున్నారు. చైర్మన్ పదవి కాలం ఇంకా 14 నెలలు ఉండగా కాంగ్రెస్, బిజెపి నాయకులు సైతం పరిశీలిస్తున్నారు. బీఆర్ఎస్ చైర్పర్సన్‌పైనే ఆ పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసం పెట్టడం ఉమ్మడి జిల్లాల్లోనే చర్చనీయంగా మారింది.

ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

- ఆటో డ్రైవర్ల రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించిన ఆటోడ్రైవర్లు

నవతెలంగాణ-రెంజల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి తమ పొట్ట కొడుతున్నారని ఆటో డ్రైవర్లు బుధవారం మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో తమ ఆటోలో ఎవరు ఎక్కడం లేదని, దీంతో తమ కుటుంబం రోడ్డున పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ప్రతి నెల జీవన భృతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అప్పటివరకు ఆటో డ్రైవర్లకు నెలకు పదిహేను వేల రూపాయల జీవనభృతి కల్పించాలన్నారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం నాయకులు షాహిద్, అబ్దుల్ అజీజ్ ఎస్ కె .హైమద్ జాను, రూపేష్, ఖదీర్, ఎండి .ఖలీల్, అబ్బన్న, రహఫ్, శేఖర్, లతీఫ్, తస్లిం తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, క్రీడా పరికరాల పంపిణీ



దుప్పట్లు, క్రీడాపరికరాలు పంపిణీ చేసిన జేడీ ఫౌండేషన్‌వారు

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలోని కస్తూరిబా గురుకుల విద్యాలయంలో బుధవారం బాలికలకు జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, పరికరాలు పంపిణీ చేశారు. చలికాలం కావడం, దుప్పట్లు లేకపోవడంతో... హాస్టల్ లో ఉన్న 200 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ స్టేట్ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి, జేడీ ఫౌండేషన్ చైర్మన్, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి 200 మంది బాలికలకు దుప్పట్లు, క్రీడా పరికరాలు ఏర్పాటుచేశారు. కాగా ఈ దుప్పట్లు, క్రీడాపరికరాలను జేడీ ఫౌండేషన్ కన్వీనర్ కవితా రెడ్డి స్వయంగా పచ్చల నడ్కుడ గ్రామానికి తీసుకెళ్లి కస్తూర్బా గురుకుల పాఠశాల బాలికలకు అందచేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కన్వీనర్ కవితా రెడ్డి మాట్లాడుతూ... చదువుకునే పిల్లలు చలికి ఇబ్బంది పడుతున్నారని తెలియగానే... దుప్పట్లు కొనుగోలుచేసి తీసుకొచ్చినట్లు తెలిపారు. అదేక్రమంలో క్రీడా పరికరాలను వినియోగించుకొని.. బాలికలు క్రీడల్లో రాణించాలని కోరారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి మట్లాడుతూ... తమ గ్రామంలోని హాస్టల్ బాలికలు చలి నుండి రక్షణ పొందటానికి దుప్పట్లు పంపిణీచేసిన జేడీ ఫౌండేషన్ చైర్మన్ వీవీ లక్ష్మీనారాయణ, కన్వీనర్ కవితా రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం నర్సారెడ్డి,ప్రిన్సిపాల్ వినోద, గ్రామస్తులు రమేష్, నర్సారెడ్డి, భూమన్న, సచిన్, వినోద్, శ్రీను, అలీమ్, లింగేశ్వర్, నెహ్రూ, జీజీ, జేమ్స్, అనిల్ గౌడ్, కాంతారావు, మహిపాల్, నాని పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామంలో డెంగ్యూ సోకిన ఇంటి నుంచి సుమారు 100 గృహాలవరకు బుధవారం సర్వే నిర్వహించి పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించడంతోపాటు నీటితొట్టిలు, కొబ్బరి చిప్పలను, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వారు తెలిపారు. గ్రామంలో ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి ఉన్నట్లయితే స్థానిక సర్పంచి, కార్యదర్శులకు సూచించి వాటిలో మట్టిని వేయించామన్నారు. గ్రామంలో నీరు నిల్వ ఉన్నచోట దోమలు పెరిగి దోమలు కాటుతో మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్ గునియా, మెదడువాపు, వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే వాటి బారీ నుంచి బయటపడే అవకాశం ఉందని సూచించారు. గ్రామంలో నీటి గుంటలలో ఆయిల్ బాల్స్ వేసినట్లయితే లార్వా వృద్ధి చెందే అవకాశం తగ్గించవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఇమ్రాన్ ఎంఎల్ పీహెచ్, ఆరోగ్య కార్యకర్తలు సరోజ, శోభ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎమ్మెల్యేను కలిసిన బంజారా శక్తి మూమెంట్ యూత్ సభ్యులు

నవతెలంగాణ-సిరికొండ

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపిన బంజార శక్తి మూవ్ మెంట్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ నాయక్, బంజార శక్తి మూమెంట్ సభ్యులు రుప్లా తండాకి చెందిన బానవత్ వెంకటేష్, గంగాధర్ నాయక్, భూపతి, నవీన్, మలోత్ చొక్ల నాయక్, కిసాన్ మర్యాద పూర్వకంగా కలిసారు జిల్లాలో బంజార యువత అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

డిమాండ్లు సాధించే వరకూ సమ్మె సాగిస్తాం

- రెండవ రోజుకు పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె



సమ్మెలో కూర్చున్న ఉద్యోగులు

నవతెలంగాణ-ఆర్మూర్

సబ్ డివిజన్ పరిధిలోని 18 సబ్ పోస్టాఫీసుల పరిధిలో పని చేస్తున్న బీపీఎంలు, ఏబీపీఎంల సమ్మె రెండోరోజు బుధవారం కొనసాగింది. సమ్మెలో భాగంగా తమ డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మె చేస్తున్నారు. రాష్ట్ర నాయకులు లింబాగౌడ్, సబ్ డివిజన్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఏళ్ల గడిచినా చాలీచాలని జీతంతో తపాల శాఖలో సేవలందిస్తున్న బీపీఎంలు, ఏబీపీఎంలు పనిఎక్కువ జీతం తక్కువతో వెట్టిచాకిరీ చేస్తున్న తమను కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖలో స్వార్థప్రయోజనాల కోసం వాడుకుంటోందని, తాము చేస్తున్న పనికి తగిన వేతనం లభించడంలేదని, నూతన పీఆర్సీలో మినిమమ్ స్కేల్‌తో రెగ్యులర్ స్కేల్ ఇస్తూ, రిటైర్మెంట్ తర్వాత మాకు వచ్చే బెనిఫిట్స్ పెన్షన్, గ్రాట్యువిటీ, కమిటేషన్ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వర్తింపజేయాలన్నారు. కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. తపాల శాఖ తమపై టార్గెట్లు విధిస్తూ వాటిని పూర్తి చేయాలని ఒత్తిడికి గురి చేస్తుందని, టార్గెట్ పూర్తిచేయకపోతే పనిష్మెంట్ ఉంటుందని హెచ్చరిస్తూ భయాందోళనలకు గురిచేస్తుందన్నారు. కనీస వేతనానికి దూరమై మొబైల్ ఫోన్లతో విధులు నిర్వహిస్తూ టార్గెట్లు పూర్తిచేయిస్తూ ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. భవిష్యత్తులో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా స్లాట్ పాయింట్లను అనుసరించాలని బలవంతు పెట్టకూడదని అన్నారు. తపాల సేవలు విస్తృతం చేయడానికి ఆర్ఐసిటి డివైజ్‌లను ఉపసంహరించి, లాప్‌టాప్‌లు, ప్రింటర్స్ బ్రాడ్‌బ్యాండ్ నెట్వర్క్ ద్వారా బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లకు ఇవ్వాలన్నారు. పెయిడ్ లీవులు 180 వరకు జమ చేసుకొని నగదు పొందే సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఈ సందర్భంగా కోరారు. జీడీఎస్‌ల డిమాండ్లు సాధించే వరకు ఈ నిరవధిక సమ్మె కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమస్యలకు తగిన పరిష్కారం లభించే వరకు మా డిమాండ్ల సాధనలో నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మంథని బీపీఎం లింబాగౌడ్, సబ్ డివిజన్ అధ్యక్షులు మచ్చర్ల బీపీఎం రమేష్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి పెర్కిట్ బీపీఎం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీపీఎంలు శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకటేష్, రవీందర్, జగదీష్, సత్యనారాయణ, భావన, శ్వేత, లక్ష్మి, దాత్రిక్, రవళి, ఏబీపీఎంలు రాజేష్, భూషన్, రాము, మృదుల, తేజశ్విని, రుతిక, శ్రీకావ్య, బాషీద్ సుదర్శన్, అఫీజ్, భూమన్న, ఫస్లొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

టేకు చెట్లు నరకడంపై ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల టేకు చెట్లను అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండా నరికిన ఘటనలో బుధవారం వార్డు సభ్యుడు శ్రీరాం గంగాధర్, పిట్టల సాయిలు అటవీశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. గత నెలలో ఈదురు గాలులకు, భారి వర్షాల కారణంగా పీహెచ్‌సీ ఆవరణలోని టేకు వృక్షాలు నేలకొరిగాయని వాటిని సర్పంచ్ కుమారుడు సురేష్ నరికి ఇంటికి తరలించినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కావున ఆయనపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అటవీశాఖ అధికారి చంద్రప్రకాశ్‌ను వివరణ కోరగా ఈదురు గాలులకు నేలకొరిగిన టేకు వృక్షాలను నరికి అక్కడే వదిలేశారని, వాటిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఈ ఘటనలో ఆరోపణలు వచ్చిన సర్పంచ్ కుమారుడు సురేష్ ను వివరణ కోరగా ఊదురు గాలులకు నేలకొరిగిన చెట్లను వైద్య సిబ్బంది సూచనతో, పంచాయతీ సిబ్బంది సమక్షంలో టేకు చెట్లను నరకడం జరిగిందని, వాటిని ఇంటికి తీసుకుపోలేదని ఆసుపత్రి ఆవరణలోనే ఉంచినట్లు తెలిపారు.

వీడియోగ్రాఫర్లకు అందని ఎలక్షన్ భత్యాలు

ఎంపీడీవో ఆఫీస్ ముందు నిరసన



నిరసన తెలుపుతున్న వీడియో గ్రాఫర్లు

నవతెలంగాణ భీంగల్

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా అక్టోబర్ 12 నుండి నవంబర్ 30 వరకు పనిచేసిన వీడియో గ్రాఫర్లకు భత్యాలను ఇప్పటికీ ఇవ్వడం లేదని బుధవారం ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు 50 రోజులు మూడు షిఫ్టుల వారీగా పని పనిచేసిన వీడియో గ్రాఫర్లకు డబ్బులు ఇవ్వాలని సంబంధిత అధికారిని డబ్బుల గురించి అడగగా ఇప్పటివరకు పైనుంచి జీవో రాలేదని పొంతన లేని సమాధానాలు చెప్తూ మభ్యపెడుతూ కాలం వెళ్ళదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్ జరిగి 14 రోజులు గడిచినప్పటికీ డబ్బులు అందలేదని, ఈ విషయమై పై అధికారికి ఆర్వోను కలిసినా అక్కడ కూడా పట్టించుకోలేదని అన్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు తమ సమస్యను పట్టించుకోని తమ ఎనిమిది గంటల డ్యూటీకి 2500 చొప్పున భత్యాలను అందించాలని కోరుతున్నారు.

టిఎస్పీఎస్సి అధికారులను జైలుకు పంపాలి

తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న నాయకులు

గత ప్రభుత్వంలో నిరుద్యోగుల ఉసురు తీసిన టిఎస్పిఎస్సి అధికారులను జైలుకు పంపాలి అని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నగర అధ్యక్షుడు అఖిల్ ఆధ్వర్యంలో నిజామాబాద్ స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కళ్ళకు గంతలు కట్టుకొని బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల కోసం విద్యార్థుల కోసం తీసుకుంటున్న చర్యలను, నిర్వహిస్తున్న సమీక్షలను, తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని అన్నారు. టిఎస్పిఎస్సి బోర్డు రద్దు చేసి నూతన బోర్డు ఏర్పాటు చేయడం పటిష్టంగా నిరుద్యోగ విద్యార్థులకు జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వడం వంటి నిర్ణయాలు హర్షించదగ్గవి అని అన్నారు. అయితే గత ప్రభుత్వంలో టీఎస్పీఎస్సీ బోర్డ్ చైర్మన్ గంటా చక్రపాణి నుండి మొదలు పెడితే ప్రస్తుత సభ్యులు ఇప్పటి చైర్మన్ జనార్ధన్ రెడ్డి వరకు నిర్లక్ష్యం వల్లే అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని, అనేక మంది విద్యార్థుల జీవితాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. కాబట్టి మళ్లీ అటువంటి ఘటనలను పునరావృతం కాకుండా అవినీతి అవకతవకలు నిర్లక్ష్యం ప్రదర్శించిన టిఎస్పిఎస్సి సభ్యులందరినీ వెంటనే జైలుకు పంపాలని, అటువంటి వారు సమాజంలో తిరగడం చూడలేమని కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్నామని అన్నారు. కాబట్టి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి విచారణ జరిపించి వారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోహేల్,మహేష్, అమాన్, సుజిత్, విష్ణు అక్మల్ సింహాద్రి ఆదిత్య అఖిలేష్ శశాంక్ కార్తిక్ కైఫ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చెట్టుకు ఢీకొని యువకుడు మృతి



నవతెలంగాణ-రెంజల్

బైక్‌పై వస్తున్న యువకుడు చెట్టుకు మారయ్య (34) బుధవారం మండలం గండిగుట్ట క్రాసింగ్ వద్ద చెట్టుకు బైక్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.. స్థానికుల సమాచారం మేరకు... నవీపేట్ నుంచి సాటాపూర్ వైపు వెళుతున్న యువకుడు చెట్టుకు ఢీకొనడంతో కింద పడిపోయాడు. వెంటనే 10 8 వాహనం వారు వచ్చి చూడగా యువకుడు మృతి చెందాడు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎస్‌జిఎఫ్ ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపికలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మినీ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల 17 సంవత్సరాల లోపు బాల బాలికల క్రీడాకారులు ఎంపికలు బుధవారం నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లాల పాఠశాలల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17,18, 19 తేదీల్లో వనపర్తి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్ జి ఎఫ కార్యదర్శి సంగీతరావు జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని ఎంపికలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిజామాబాద్ జిల్లా ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలుస్తుందన్నారు. ఈ సంవత్సరం కూడా మన జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లాకు పేరు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హాకీ సంఘం కోశాధికారి సురేందర్, హాకీ సంఘ సభ్యులు చిన్నయ్య, నాగేష్, వ్యాయామ ఉపాధ్యాయులు మంచిర్యాల సురేష్ కుమార్,.స్వామి, రాజేష్ , రాజేశ్వర ,శ్రీకాంత్, కత్తి శ్రీనివాస్ కామారెడ్డి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, మీనా, సంతోష్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, ఉపాధి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈజీఎంఎం ద్వారా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఉపాధి నిర్వహించబడునని ఈజీఎంఎం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాక్ భవనంలో శిక్షణ తరగతులకు దరఖాస్తులు ఈనెల 18 లోపు చేసుకోవాలని, నిజామాబాద్ జిల్లాలోని నూతన కలెక్టర్ కార్యాలయం దగ్గర న్యాక్ శిక్షణ భవనంలో ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డ్, ఫుడ్ సెక్యూరిటీ కార్డ్, బ్యాంక్ అకౌంట్, ఫొటోస్ -2 తీసుకోని రావాలని తెలిపారు. ఉచిత హాస్టల్ వసతి, స్టేషనరీ (బుక్,పెన్),యూనిఫాం(టీ -షర్ట్స్, బ్యాగ్స్) ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. ఎలక్ట్రికల్ విభాగంలో అన్ని రకాల ప్రాక్టికల్స్ హౌజ్ వైరింగ్, ఫ్యాన్ రిపేర్, ఏసీ రిపేర్, ట్రాన్స్‌ఫార్మర్లు నేర్పించబడునని పేర్కొన్నారు. ల్యాండ్ సర్వేయర్ విభాగంలో ఆటో లెవెల్, ఆఫ్ సెట్ సర్వేయింగ్, ట్రవెర్సింగ్ నేర్పించబడునని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్టు తెలిపారు. మరింత సమాచారం కోసం ల్యాండ్ సర్వేయర్ సరోజ -7981360101, ఎలక్ట్రికల్ లింబాద్రీ- 8498867895, దిలీప్-9704587655 లను సంప్రదించండి అని అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్.ప్రభాకర్ -6281992068 ను సంప్రదించాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

నవతెలంగాణ-కమర్‌పల్లి


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన బద్దం చిన్న రాజేశ్వర్ కుమారుడు బద్దం రవి రెడ్డి తమ వంతు సహాయంగా రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు బుధవారం విరాళం మొత్తాన్ని ఆలయ సభ్యులకు అందజేశారు. బద్దం రవి రెడ్డికి అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, బద్దం రాకేష్, సురంగి చంద్రశేఖర్, రాజారామ్, అయ్యప్ప మాలధారణ స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రిజర్వేషన్లపై పరేషాన్

- పోటికి సన్నద్ధంగా ఉన్నా మార్పుచెస్తే నిరాశ
- కొత్త ప్రభుత్వం రిజర్వేషన్లు మారుస్తుందా..?

నవతెలంగాణ-వర్ని



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో కొత్త విధానాలు అమలు అవుతున్నాయి. అందులో ప్రదానంగా మున్ముందు వచ్చే పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లలో మార్పులు జరిగితే సర్పంచుగా ఉన్న వారు, కొత్తగా పోటి చేద్దాం అనుకునే ఆశావహులకు పరేషాన్‌గా మారింది. కేసీఆర్ సర్పంచులకు రిజర్వేషన్ పదేళ్లు కల్పించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి సర్పంచుల రిజర్వేషన్‌లపై నోరువిప్పకపోవటంతో రిజర్వేషన్ లు ఎలా ఉంటాయో అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు.

సోషల్ మిడియా ప్రచారాలతో అతలాకుతలం

పంచాయతి ఎన్నికలల్లో రిజర్వేషన్లు మారుతాయని, వెచ్చే జనవరి నెలలో నోటిఫికేషన్ పడుతుందనికొందరు సొషల్ మీడియాలో వార్తలు చక్కరలు కొట్టడంతో నిజమా.. కాదా.. అని ఆశావహుల ఆశ, నిరాశలతో ఉన్నట్లు సమాచారం. సర్పంచుల పదవి కాలం పూర్తి అయినట్లే అయిన ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలపై ఎలాంటి ప్రకటన చేయకపోవటం చూస్తే రిజర్వేషన్ల మార్పు కొసమె సమయం తీసుకొంటోందని పుకార్లు సోషల్ మిడియాలో షికార్లు చేస్తున్నాయి. దీంతో సర్పంచు రేసులో కొనసాగే ఆశావహులకు నిద్ర పట్టడం లేదని రచ్చ బండల వద్ద ప్రజల చర్చించుకుంటున్నారు. చివరి ప్రభుత్వం కుల జనాభా ప్రకారమా.. ? లేకా పాత విధానమే కొనసాగిస్తుందా ? అనేదీ ప్రశ్నగా మారింది.

రెడ్ కలర్ డే సంబరాలు



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో గల కిడ్స్ పార్క్ స్కూల్లో రెడ్ కలర్ డే ను ఘనంగా జరుపుకున్నారు. పిల్లలందరూ రెడ్ కలర్ డ్రెస్‌లలో వచ్చి ఆనందంగా ఆటపాటలతో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. రెడ్ కలర్ యొక్క ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. ఇందులో పాఠశాల హెడ్మాస్టర్, ఆసిఫ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలూర్ ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడండి

- మున్సిపల్ కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్


వినతి పత్రాన్ని అందజేస్తున్న పిడిఎస్‌యూ నాయకులు

జెడ్పిహెచ్ఎస్ కాలూర్ పాఠశాల స్థలాన్ని కాపాడాలని పిడిఎస్‌యూ నగర కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్, కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నగర అధ్యక్షులు ఎస్కే అశుర్ మాట్లాడుతూ... నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఒకటో డివిజన్ పరిధిలోని సర్వేనెంబర్ 1235/1లోగల జిల్లా పరిషత్ హై స్కూల్ కాలూరు స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేస్తూన్నారని అన్నారు. సుమారు రెండు కోట్ల రూపాయల విలువచేసే ఎకరం పైగా స్కూలు స్థలాన్ని ఇతరులకు వదిలేసి, గత సంవత్సరం ప్రహరీ గోడ కట్టే ప్రయత్నం చేశారన్నారు. గతంలో పాఠశాల స్థలం కబ్జాకు గురవుతుందని, వెంటనే సర్వే చేసి హద్దులు నిర్ణయించి, ప్రహరీ గోడ లేదా పెన్సింగ్ వేయాలని కలెక్టర్, రూరల్ ఎమ్మెల్యేగా ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్‌కు, జిల్లా విద్యాధికారికి, ఏడి, ల్యాండ్స్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌కు పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు ఇదివరకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ నేపథ్యంలోనే నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశానుసారం ఏడి, ల్యాండ్, సర్వే పాఠశాల స్థలాన్ని సర్వే చేసి, హద్దులు నిర్ణయించారన్నారు. తాజాగా సర్వే రిపోర్టుకు భిన్నంగా ఈ స్కూలు స్థలాన్ని మళ్లీ కబ్జా చేసి రోడ్డు వేసుకోవాలని పాఠశాల స్థలాన్ని అరఎకరం పైగా ఇతరులకు వదిలేసి గేట్లు బిగించాలని గ్రామంలోని కొంతమంది ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ విషయమై గ్రామస్తులు రూరల్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తే వారి ఆదేశం మేరకు పోలీసులు వచ్చి పని ఆపివేయించారన్నారు. వెంటనే పాఠశాల స్థలాన్ని కబ్జా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని, గత సంవత్సరం ఏడి సర్వే చేసి హద్దులు నిర్ణయించిన ప్రకారమే ప్రహరీ నిర్మించి, పాఠశాల స్థలాన్ని కబ్జాల నుండి కాపాడాలని కోరారు. లేని పక్షంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామ ప్రజలతో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్యు నగర నాయకులు రాజేశ్వర్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ మరమ్మత్తులు

నవతెలంగాణ-సిరికొండ

మిషన్ భగీరథ ఇందల్వాయి ప్లాంట్ లో మరమ్మత్తుల దృష్ట్యా (వర్క్స్) 15.12.2023 ఉదయం వరకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. అన్ని గ్రామాల ప్రజలు ముందస్తుగా నీళ్ల అసౌకర్యాన్ని గమనించాలని, అందరూ సహకరించాలని అధికారులు వెల్లడించారు.

ఉపాధ్యాయుల సేవ మరువలేనిది



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని కాటేపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లిన ప్రధానోపాధ్యాయులు సంజీవ్ రెడ్డి, ఉపాధ్యాయులు మహేశ్వర్ ను ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, సర్పంచ్ విఠల్, నాయకులు, ఉపాధ్యా బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ధోఖేబాజ్ గంగారాం

- డోంగ్లి సభలో ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మికాంతరావు

నవతెలంగాణ-మద్నూర్

అసెంబ్లీ ఎన్నికల్లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ బహిష్కరణ నేత సౌదాగర్ గంగారాం తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన దోకేబాజ్ అని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. డోంగ్లి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన తనను ఓడించాలని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హనుమంతు సింధే గెలుపు కోసం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కారు గుర్తుకు ఓటు వేయాలని సౌదాగర్ గంగారాం పిలుపునిచ్చారన్నారు. సౌదాగర్ గంగారాం మాయమాటలను పట్టించుకోకుండా తనను గెలిపించినందుకు ఎల్లప్పుడూ మీ సేవలో ఉంటానని నాయకులకు, కార్యకర్తలకు అభయం ఇచ్చారు. జుక్కల్ నియోజకవర్గంలో పార్టీని భ్రష్టు పట్టించాడని, అలాంటి వ్యక్తిని నాయకులు, కార్యకర్తలు నమ్మకుండా తన గెలుపు కోసం కృషి చేసినందుకు మీ రుణం మరువలేనని, ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు, జుక్కల్ నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయని, ఇక ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. సభలో డోంగ్లి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సొసైటీ మాజీ చైర్మన్ శివాజీ పటేల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గంగారం పటేల్, డోంగ్లీ, మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

రూ.5.54 కోట్లు ఎరువుల బకాయిలు

- మాజీ మంత్రి నియోజకవర్గంలో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ జిల్లాలో సొసైటీలు రైతుల వద్ద వసూల్ చేసిన ఎరువుల డబ్బులను కంపెనీలకు చెల్లించలేదని సమాచారం. రబీ సీజన్‌లో రైతులకు రసాయన ఎరువులు అందే అవకాశం లేకుండా పోయింది. తాజాగా ఈ సీజన్‌కు సంబంధించిన డబ్బుల బకాయిలు ఉండడంతో ఎరువుల కంపెనీలు సొసైటీలకు స్టాక్ ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. దానితో రైతులకు కష్టాలు తప్పేలా కనిపించడం లేదు. అయితే రైతులు సొసైటీల నుంచి సబ్సిడీ కింద తీసుకున్న ఎరువులు డబ్బులను చెల్లించిన పాలకవర్గం మాత్రమే కంపెనీలకు డబ్బులు చెల్లించలేదన్న వాదనలు ఉన్నాయి. ప్రధానంగా చైర్మన్లు, మిగితా పాలకవర్గం సొసైటీ నుంచి తీసుకున్న ఎరువుల డబ్బులను జమ చేయలేదని అవే ఇప్పుడు లక్షలకు లక్షలుగా పేరుకపోయినట్లు సమాచారం. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో 144 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. అందులోనూ బాల్కొండ నియోజకవర్గంలోనే దాదాపు రూ.5 కోట్ల పైచిలుకు ఎరువు బస్తాలకు సంబంధించిన బకాయిలు ఉండడంతో ఈ సీజన్‌లో రైతులకు అక్కడ ఎరువులు దక్కే అవకాశం లేకుండా పోయినట్టు సమాచారం.

మొన్నటి వరకు బాల్కొండ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి హయంలోనే ఈ బకాయిలు ఉన్నాయని, రైతులను ఎరువుల కోసం సొసైటీల చైర్మన్లను నిలదీయాలని కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో వివిధ సొసైటీలో ఉన్నబకాయిల గురించి చేసిన పోస్టు వైరల్‌గా మారింది.బాల్కొండ సొసైటీకి సంబంధించిన రూ.34,518, బుస్సాపూర్ సొసైటీ రూ.28,53,786, చౌట్‌పల్లి సొసైటీ రూ.20,05,306, కమ్మర్‌పల్లి సొసైటీ రూ.45,04,218, కోనాసముందర్‌లో రూ.17,69,947, మోర్తాడ్ సొసైటీలో రూ.46,55,254, మోతే సొసైటీలో రూ.9412, పచ్చలనడ్కుడలో రూ.2,52,565, పడిగెల్ సొసైటీలో రూ.84,77,653, రామన్నపేట్ సొసైటీలో రూ.2,113, రెంజర్ల సొసైటీలో రూ.11,255, సావెల్ రూ.65,95,868, శెట్‌పల్లిలో రూ.21,55,692, తాళ్లరాంపూర్‌లో రూ.94,60,032, వేల్పూర్‌లో రూ.8388, వేంపల్లిలో రూ.65,49, 066, ఏర్గట్లలో రూ.42,28,688 బకాయిలు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. మొత్తం రూ. 5 కోట్ల 54 లక్షల 57 వేల 458 బకాయిలు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

వైన్‌షాప్‌లో చోరి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి చౌరస్తాలో గల వైన్ షాపులో మంగళవారం రాత్రి దొంగతనం జైరిగినట్లు ఎస్సై యన్.రాజేష్ బుధవారం తెలిపారు. ఎస్సై వివరణ ప్రకారం.. షట్టర్ తెరచి 20 వేల మద్యం 24 వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ట్లు తెలిపారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం తప్పు చేస్తే.. నిలదీద్దాం

- రాష్ట్రంలో మనం బలమైన ప్రతిపక్షం
- రైతుబంధు 15 వేలు అన్నారు.. చివరకు బీఆర్ఎస్ ఇచ్చినట్టే ఇస్తున్నరు
- స్థానిక సంస్థల్లో అన్ని స్థానాలు క్రైవసం చేసుకుందాం
- కార్యకర్తలతో, నాయకులతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-బాన్సువాడ



'శాసనసభలో అయినా బయట అయినా మంచి పనులు చేస్తే సమర్థిస్తాం, ప్రజా వ్యతిరేక విధానాలు చేస్తే గట్టిగా నిలదీస్తాం. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోండి. మీకు అన్ని విదాలుగా మద్దతిస్తాం. ప్రజలు, రైతులు బాగుపడటమే మాకు కావాలి. ప్రభుత్వం తప్పు చేస్తే నిలదీశుడే. రాష్ట్రంలోమనం బలమైన ప్రతిక్షంగా ఉన్నాం' అని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

బాన్సువాడ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కృతజ్ఞత సభ, ఆత్మీయ సమ్మేళనం బాన్సువాడపట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడారు. 'సమైక్య రాష్ట్ర చరిత్రలో, తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్ గా పనిచేసిన వారు తరువాత ఎన్నికలలో ఓడిపోతారనే పుకారు ఉండేది. నిజంగానే గతంలో స్పీకర్లు గా పనిచేసిన వారు అందరూ ఓడిపోయారు. కానీ బాన్సువాడ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకు మీరు పడిన కష్టంతో మనం చరిత్ర తిరగరాసాం. ఈ గెలుపు కార్యకర్తల కష్టంతో సాధ్యమైంది' అని అన్నారు.

'అన్ని బూత్‌లలో కూడా గతంలో కంటే ఈసారి బీఆర్ఎస్ పార్టీకి ఎక్కువ మెజారిటీ వచ్చింది. నాకంటే మీరు ఎక్కువగా రాత్రింబవళ్లు కష్టపడ్డారు. తప్పకుండా మీ రుణం తీర్చుకుంటాను. స్పీకర్ గా పనిచేసి ఎన్నికల్లో విజయం సాదించడంతో రాష్ట్రంలో ఇప్పుడు నన్ను అందరూ ప్రత్యేకంగా చూస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో పోలైన ఓట్లలో 50 శాతానికి పైగా ఓట్లు బీఆర్ఎస్ పార్టీకి వచ్చాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విజయం సాదించిన ఇతర ఎమ్మెల్యేలకు 40 నుండి 42 శాతం మాత్రమే వచ్చాయి. ఈ విజయం వెనుక వేలాది మంది నాయకుల, కార్యకర్తల కషి ఉన్నదని' అన్నారు.

'తెలంగాణ శాసన సభలో అత్యంత ఎక్కువ వయస్సు సభ్యుడిని నేనే. కేసీఆర్ తరువాత ఎక్కువ సార్లు విజయం సాధించిన శాసన సభ్యుడిని కూడా నేనే. 8 సార్లు పోటీ చేస్తే 7 సార్లు గెలిపించారు. ఈ ఘనత మీదే. నా అనుభవాన్ని, శక్తిని, ఓపికను సంపూర్ణంగా మీ కోసమే శాయశక్తులా ఉపయోగిస్తాను. మీరు ఎవరికి బయపడాల్సిన అవసరం లేదు. ఇల్లు అలకగానే పండుగ కాదు. రైతుబంధు రూ. 15,000 ఇస్తాం అన్నారు, మళ్ళీ మనం ఇచ్చిన రూ. 10,000 లే ఇస్తున్నారు. ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోగానే రెండు లక్షల రుణమాఫీ అన్నారు, ఇప్పటి వరకు రెండు రూపాయల మాఫీ కూడా లేదు. ముందున్నది ముసళ్ళ పండుగ. శాసనసభలో అయినా బయట అయినా మంచి పనులు చేస్తే సమర్థిస్తాం, ప్రజా వ్యతిరేక విధానాలు చేస్తే గట్టిగా నిలదీస్తాం. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోండి. మీకు అన్ని విదాలుగా మద్దతిస్తాం. ప్రజలు, రైతులు బాగుపడటమే మాకు కావాలి' అని అన్నారు.

'త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు వస్తున్నాయి. మీరందరు కలిసి కష్టపడి నన్ను గెలిపించారు. అదేవిధంగా వచ్చే ఎన్నికలలో మీరందరు గెలవాలి, మీ గెలుపు కోసం నేను కష్టపడి పనిచేస్తాను.నాకు 75 సంవత్సరాల వయస్సు, అయినా 25 సంవత్సరాల యువకుని అంత ఓపిక, శక్తి ఉన్నాయి. త్వరలోనే మండలాలు గ్రామాల వారిగా సమావేశాలు నిర్వహిస్తాను. చిన్న చిన్న విభేదాలు ఉంటే రూపుమాపుదాం. స్థానిక ఎన్నికలకు అందరూ సిద్ధం అవ్వండి. స్థానికంగా మీ అందరితో చర్చించిన తరువాతనే, మీ అభిప్రాయం ప్రకారమే అభ్యర్థులను ఎంపిక చేసుకుందాం. మీ సూచనలే ఫైనల్, ఏకపక్ష నిర్ణయాలు ఉండవు. బాన్సువాడ నియోజకవర్గంలో మన ప్రత్యర్థులు బలంగా లేరు. మనం బలంగా ఉన్నాం. గ్రూపులే మన బలహీనత. గ్రూపులు, విభేదాలు పక్కన పెట్టండి, కులాలకు అతీతంగా అందరూ కలిసి పోరాడాలి. ఐకమత్యంగా పోరాడుదాం. అత్యధిక స్థానాలను గెలుచుకుందాం. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ఏమి ఉన్నా, బాన్సువాడలో మనం ఉన్నాం. నేను శాసనసభ్యునిగా ఉన్నా కాబట్టి మీరు బయపడాల్సిన అవసరం లేదు. రాజకీయాలలో విమర్శలు సహజం, అయితే నాయకుల విమర్శలు హుందాగా ఉండాలి. చిల్లరగా ఉండకూడదు. రాజకీయం అనేది ప్రజలకు సేవ చేసే శక్తివంతమైన ఆయుధం. చిల్లరగా వాడి దాని హుందాతనం చెడగొట్టకూడదు. కొంతమంది అలా మాట్లాడుతుంటారు. ఈమధ్య ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏనుగు రవీందర్ రెడ్డి బీర్కూరు మండలం భైరాపూర్ గ్రామంలో ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇల్లు రాలేదని విమర్శలు చేసిండు. విషయం ప్రజలకు తెలిసి ఆయన సంగతి తేల్చడానికి సిద్దమయ్యారు. అలాంటి పరిస్థితి తెచ్చుకోవద్దు. ప్రజలకు వాస్తవాలనే చెప్పాలి. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏనుగు రవీందర్ రెడ్డి ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టలేదు. ఆయన స్వగ్రామం ఎర్రపహాడ్‌లో కూడా ఒక్క ఇల్లు కట్టలేదు. వేల ఇల్లు కట్టించిన నేను ఎందుకు మాటలు పడాలి. డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణంలో బాన్సువాడ నియోజకవర్గం రాష్ట్రంలో ఆదర్శంగా ఉన్నది. మాట్లాడే ముందు తన గురించి తాను ఆలోచన చేసుకుని మాట్లాడాలి. అభివద్ధికి చిరునామా బాన్సువాడ నియోజకవర్గం. డబుల్ బెడ్ ఇళ్ళ కు చిరునామా బాన్సువాడ నియోజకవర్గం. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో కొన్ని చోట్ల మెజారిటీ తగ్గి నేను అసహనంతో మాట్లాడాను, అది ఆవేదన మాత్రమే. ఎవరి మనసైనా నొచ్చుకుంటే క్షమించండి. రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షం ఉన్నది. ప్రభుత్వం ఏ తప్పు చేసినా నిలదీస్తాం. మీరు నాకు బలం, నేను మీకు బలం. దీనిని ఎవ్వరూ చేదించలేరు. ముందు ముందు మనం హుషారుగా పనిచేయాలి. ధైర్యంగా ముందడుగు వేద్దాం. అందరూ సహకరించాలని' కోరారు. ఈ సమ్మేళనంలో మాజీ శాసనసభ్యులు కత్తెర గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు డి అంజిరెడ్డి, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, బద్యానాయక్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.